నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | గురువారం 2 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## కూలీల హాజరు శాతం పెంచాలి..

**రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్**

అధికారులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్

జైనూర్ మే 1 : ఉపాధి హామీ పనుల్లో కూలీల హాజరు శాతం పెంచాలని గ్రామీణ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ అన్నారు. బుధవారం ఆమె జైనూర్ మండలంలో పర్యటించారు. జైనూర్ మేజర్ గ్రామ పంచాయతీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కల నర్సరీని పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ఆమె వెంట ఆసిఫాబాద్ డీఆర్‌డీవో సురేందర్, డీపీవో భిక్షపతిగౌడ్, ఎంపీడీవో ప్రభుదయ, ఈజీఎస్ ఏపీవో నగేశ్, ఐకేపీ ఏపీఎం సుజాత, ఈవో శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెండ్ రాం చందర్, సీనియర్ అసిస్టెంట్ మోహన్, పంచాయతీరాజ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రచార రథం అడ్డగింత

● ఓట్ల పేరుతో ప్రచారానికి రావద్దని ● రాజారం గ్రామస్తుల హెచ్చరిక

రాజారంలో ఎన్నికల ప్రచార రథాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

కోటపల్లి, మే 1 : 'మా గ్రామానికి రోడ్డు వేయనిదే ఓట్లు వేయం' అని పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించిన కోటపల్లి మండలం రాజారం గ్రామస్తులు బుధవారం గ్రామానికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రచార రథాన్ని అడ్డుకున్నారు. గ్రామ సమస్యల పరిష్కారానికే తాము ఎన్నికలను బహిష్కరించామని, ఈ విషయం తెలిసినా ఎమ్మెల్యే గడ్డం వివేక్ తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు ఓట్ల పేరుతో తమ గ్రామానికి వస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్తులు హెచ్చరించారు.

## బీఆర్ఎస్‌ను గెలిపించాలి

**ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు**

జన్నారం, మే 1 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం కోసం పార్టీ శ్రేణులు ఐక్యతగా ఉండి కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. బుధవారం జన్నారం మండల కేంద్రంలో కలిసి మాట్లాడారు. కేసీఆర్ సర్కారు అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రచారం చేయాలన్నారు. హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్ తీరును ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం మొదటి సారి మండలానికి వచ్చిన ఆయనను బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, ఫజల్‌ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్‌కుమార్, సింగిల్ విండో మాజీ చైర్మన్ శీలం రమేశ్, సులువ జనార్దన్, కేఏ నర్సింహులు, రాజేశ్వర్, రాజ్‌కుమార్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



జన్నారం ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కును సన్మానిస్తున్న జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్

## కేసీఆర్ రోడ్‌షో రూట్‌మ్యాప్ పరిశీలన

మంచిర్యాలటౌన్, మే 1: ఈ నెల 4న బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంచిర్యాలలో నిర్వహించనున్న రోడ్ షో రూట్‌మ్యాప్, చేపట్టాల్సిన ఏర్పాట్లను బుధవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పరిశీలించారు. ఈ నెల 4న సాయంత్రం ఐదుగంటలకు గోదావరిఖని నుంచి శ్రీరాంపూర్ మీదుగా మంచిర్యాలకు చేరుకుంటారు. ఓవర్ బ్రిడ్జి కిందకు దిగిన తర్వాత ప్రజలకు అభివాదం చేస్తూ ఐబీ చౌరస్తా (అంబేద్కర్ చౌరస్తాలో)లో రోడ్ షోలో ప్రచారం చేయనున్నారు. దాదాపు 40 వేల మంది జనాలు తరలిరానున్నారని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, కౌన్సిలర్ గాదెసత్యం, బీఆర్ఎస్ నాయకులు శ్రీరాముల మల్లేశ్, తాజుద్దీన్, కర్రు శంకర్, పాల్గొన్నారు.

మంచిర్యాలలోని ఐబీ చౌరస్తాలో రోడ్‌షో కోసం పరిశీలిస్తున్న బాల్కసుమన్, దివాకర్‌రావు

## ఈవీఎంల గోదాం పరిశీలన

ఆసిఫాబాద్ టౌన్, మే 1 : ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన గోదాంను బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అడిషనల్ కలెక్టర్ వేణు, ఆసిఫాబాద్ మండలాధికారి లోకేశ్వర్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను మొదటి విడుత పరిశీలన పూర్తి చేసి, ఎన్నికల్లో ఉపయోగిస్తామని తెలిపారు. గోదాంలో ఉన్న సీసీ టీవీల పనితీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ మధూకర్, నాయబ్ తహసీల్దార్ జితేందర్ పాల్గొన్నారు.

### అప్రమత్తంగా ఉండాలి..

వేసవికాలం దృష్ట్యా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం ఈ నెల 6వ తేదీ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. మధ్యాహ్నం అత్యవసరం అయితే తప్పా బయటకు రావద్దని సూచించారు. గర్భిణులు, వయోవృద్ధులు, చిన్నపిల్లలు ఎండలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాంను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్ దోత్రే

## ఏర్పాట్లు చేయండి..

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు, అధికారులు

నస్పూర్, మే 1 : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మే 13వ తేదీన జరగనున్న పోలింగ్‌లో పాల్గొనే ఓటర్లకు అసౌకర్యం కలుగకుండా పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు, ఆర్డీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ కోసం ప్రత్యేక బృందాలను నియమించడం జరిగిందని, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు సెగ్మెంట్లలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు రాహుల్, మోతీలాల్, ఆర్డీవో రాములు, ప్రత్యేక ఉప పాలన అధికారి చంద్రకళ, డీపీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పురుడు కోసం వెళ్తే.. పుట్టెడు కష్టాలు..

● మంచిర్యాల ఎంసీహెచ్‌లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ● వైద్యులను కలిసేందుకు అనుమతించని వైనం
● ఇక్కడ ప్రసవం చేయకపోవడంతో ప్రైవేటుకు వెళ్తున్న బాధితులు

మంచిర్యాలలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం

మంచిర్యాల, మే 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల మాత, శిశు సంరక్షణ కేంద్రంలో రోగులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో వైద్య సిబ్బంది విఫలం అవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఆసుపత్రిలో అడ్మిట్ చేశాక పేషెంట్ ఉన్న రూమ్‌లో వాసన వస్తుందని, రూమ్ బాగోలేదని క్లీన్ చేయాలని ఎన్నిసార్లు చెప్పినా సిబ్బంది పట్టించుకోలేదని నర్మద భర్త చెప్పున్నారు. బీపీ కంట్రోల్‌లోకి వచ్చాక వైద్య సిబ్బంది ఒక ఇంజక్షన్ రాసి ఇచ్చి బయటకి వెళ్లి తెచ్చుకోమన్నారని... ఇది ఏం ఇంజక్షన్ ఇలా స్లిప్‌పై రాసిస్తే ఎలా.. బయటికి వెళ్లి తెచ్చుకోవడం ఎందుకు అని అడిగితే సమాధానం చెప్పలేదంటున్నారు. ఈ ఇంజక్షన్ ఎందుకని వైద్యురాలిని అడుగాలంటే సిబ్బంది కలవనియ్యలేదంటున్నారు. 23వ తేదీన ఎంసీహెచ్‌కు వెళ్లే 24వ తేదీ డెలివరీ చేస్తామన్నారని... అక్కడ నచ్చక ఇంటికి వెళ్లిపోతామంటే మా ఇష్టపూర్వకంగానే ఇంటికి వెళ్తున్నట్లు సంతకం చేసి పోవాలని చెప్పారన్నారు. తప్పని సరి పరిస్థితుల్లో నా భార్యతో సంతకం చేయించి ఇంటికి తీసుకెళ్లామని, వారం రోజులయ్యాక ఈ రోజు డెలివరీ అయ్యిందని ఆయన తెలిపారు. నొప్పులు రావడానికే నా భార్యకు ఇంజక్షన్ వేయాలని చూశారా..? అది ఏం ఇంజక్షన్.. స్లిప్‌పై ఎందుకు రాసిచ్చారు అనే విషయాలపై ఇప్పటికీ స్పష్టత లేదని వాపోయారు. నా కంటే కొంచెం తెలుసు ఇంజక్షన్ దేని కోసమని నేను అడిగాను.. ఏం తెలియని అమాయకులు ఇంజక్షన్ తెచ్చి ఇచ్చాక అది వికటిస్తే వాళ్ల పరిస్థితి ఏంటో ఒక్కసారి ఆలోచించాలన్నారు. అదే ఆసుపత్రిని నీట్‌గా మెయింటేన్ చేస్తే డెలివరీ చేయించుకునేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన చెప్పారు. ఇలాంటి కేసులు రోజుకు రెండు, మూడైనా ఎంసీహెచ్‌లో ఉంటాయని డెలివరీల కోసం వచ్చే బాధితులు చెప్తున్నారు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డిని వివరణ కోరగా.. ఎలాంటి ఇబ్బందులున్నా ఆసుపత్రి హెల్ప్‌డెస్క్‌లో చెప్పుకోవచ్చన్నారు. నార్మల్ డెలివరీలు చేయించుకోవడం ఇష్టం లేని కొందరు సిజేరియన్ కోసం బయటికి వెళ్తున్నారన్నారు. సిజేరియన్ మేం చేయమని చెప్తే ఇలా బయటికి వచ్చి విమర్శలు చేస్తారన్నారు.



నా ఇష్టపూర్వకంగా ఇంటికి వెళ్లిపోతున్నా అని నర్మదతో రాయించుకున్న ఆసుపత్రి సిబ్బంది

*హాజీపూర్ మండలంలోని దొనబండ గ్రామ పంచాయతీ పరిధిలోని బుద్ధిపల్లికి చెందిన తిర్రి నర్మద ఈ నెల 23వ తేదీన చెకప్ కోసం మంచిర్యాల మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి వచ్చారు. పరీక్షించిన వైద్యురాలు బీపీ ఎక్కువైందని అడ్మిట్ కావాలని చెప్పారు. ఒకరోజు ఆసుపత్రిలో ఉన్నాక బీపీ నార్మల్‌కి వచ్చింది. రేపు డెలివరీ చేస్తామని ఓ పేపర్ మీద ఇంజక్షన్ రాసి ఇచ్చారు. ఇదేం ఇంజక్షన్ ఒకసారి డాక్టర్‌ను కలవాలని నర్మద భర్త ప్రశాంత్ వైద్య సిబ్బందిని అడిగితే వారి నుంచి సమాధానం రాలేదు. నర్మద ఉన్న రూమ్ మొత్తం వాసన కొడుతుందని క్లీన్ చేయాలని కోరిన సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో విసుగెత్తిపోయిన అతను భార్యను తీసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది నా ఇష్ట పూర్వకంగానే ఇంటికి వెళ్తున్నా నాకు, బిడ్డకు ఏం జరిగినా ఆసుపత్రికి సంబంధం లేదంటూ ఓ సంతకం చేయించుకుని పంపించారు. అలా 24వ తేదీనే డెలివరీ అవుతుందని చెప్పిన నర్మద మే 1వ తేదీన మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో డెలివరీ అయ్యింది.*

*బెల్లంపల్లికి చెందిన మరో మహిళ మంగళవారం సాయంత్రం డెలివరీ కోసం మంచిర్యాల ఎంసీహెచ్‌కు వచ్చింది. మూడు రోజుల క్రితం ఆసుపత్రికి వచ్చిన ఆమెకు నొప్పులు వచ్చాక ఆసుపత్రికి రండి అని వైద్యులు సూచించారు. ఆమెను సిబ్బంది కూడా పట్టించుకోలేదు. బెడ్ కూడా ఇవ్వలేదు. బుధవారం మధ్యాహ్నం వరకు ఎదురుచూసిన సదరు మహిళ తరపున బంధువులు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. బయటికి వెళ్లే సమయంలో వచ్చిన వైద్యురాలు ఎక్కడికి వెళ్తున్నారు అని ప్రశ్నించారు. ఆసుపత్రిలో ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తున్నామని బాధితులు చెప్పాక అప్పుడు వైద్యురాలు తీసుకెళ్లి నార్మల్ డెలివరీ చేశారు.*

## మా మద్దతు 'బీఆర్ఎస్' కే..

**టీఎంహెచ్‌డీ నాయకులు**

మంచిర్యాల ఏసీసీ, మే 1: అపర కుభేరుడు, కార్మిక, బలహీన వర్గాల నాయకుడికి మధ్య లో జరుగుతున్న పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల పోరులో బీఆర్ఎస్ పార్టీకే మద్దతు ఇస్తామని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్‌డీ) నాయకులు ప్రకటించారు. బుధవారం పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థిని అత్యంత మెజారిటీతో గెలిపించేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుశ్నపల్లి రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండుకూరి రాజు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి రాజలింగు, నాయకులు రేగొండ శ్రీనివాస్, తుంగపిండి అనిల్, కొండకూరి ప్రశాంత్ పాల్గొన్నారు.



కొప్పుల ఈశ్వర్‌కు మద్దతు తెలుపుతున్న టీఎంహెచ్‌డీ నాయకులు

## కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

● హామీలను విస్మరించిన వారిని ఓడించాలి ● మాజీ శాసన సభ్యుడు బాల్క సుమన్

రామకృష్ణాపూర్ ప్రచార సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

రామకృష్ణాపూర్, మే 1: హామీలు ఇచ్చి విస్మరించిన కాంగ్రెస్ పార్టీకి చురుకు తగలాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేయాలని ప్రజలను చెన్నూరు మాజీ శాసన సభ్యుడు, మంచిర్యాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాల్క సుమన్ కోరారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ 3,4, 19, 20 వార్డుల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాజీ విప్ మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీకి రూ.25 కోట్ల ఎస్డీఎఫ్ నిధులు తీసుకువస్తే నిలుపుదల చేశారని, సమీకృత మార్కెట్, పార్కులు నిర్మాణాలు ఆగిపోయాయని, తాగునీరు, సాగునీటికి ప్రజలు గోసపడుతున్నారని తెలిపారు. రెండు లక్షల రుణమాఫీ అని రైతులను, రూ.2500 ఆర్థిక సాయం ఇస్తామని మహిళలను మోసం చేశారని విమర్శించారు. హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, సీనియర్ నాయకులు రాజారమేశ్‌బాబు, రామిడికుమార్, పచ్చిక లక్ష్మారెడ్డి, ఎండీ రహీమ్,కౌన్సిలర్లు రేవెల్లి ఓదెలు, బోయినపల్లి అనిల్‌రావు, జాడి శ్రీనివాస్, జిలకర మహేశ్, జంజుపెల్లి శశికుమార్, సాంబర్ శేఖర్, నందెల్లి లలిత,లింగం మాధవి, గోనె రాజేందర్, చంద్రకిరణ్, జాన్ రాజు, రమేశ్‌రెడ్డి, నాలుగు వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

### కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయండి

ఈ నెల 4న సాయంత్రం మంచిర్యాల జిల్లాలోని ఐబీ చౌరస్తా కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని మాజీ విప్ బాల్క సుమన్ బొక్కలగుట్ట గ్రామస్తులను కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా మందమర్రి మండలంలోని బొక్కలగుట్ట గ్రామంలో రైతు బంధు సమితి మందమర్రి మండల కో-ఆర్డినేటర్ బలికొండ కిషన్ ఇంటి వద్ద బొక్కలగుట్ట, పులిమడుగు, అందుగులపేట గ్రామాల బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్‌ను గెలిపించాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజారమేశ్, రైతు బంధు సమితి కో-ఆర్డినేటర్ బలికొండ కిషన్, పంగ శ్రీధర్, మారుపాక రాజయ్య, రవినాయక్ ప్రజలు పాల్గొన్నారు.

## కేసీఆర్ కృషితోనే కారుణ్య నియామకాలు

● బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సింగరేణిలో హక్కులు, సమస్యల పరిష్కారం
● మాజీ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

మందమర్రిలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడుబాల్కసుమన్

మందమర్రి, మే 1 : జాతీయ పార్టీలు వాటి అనుబంధ జాతీయ కార్మిక సంఘాలు సింగరేణిలో ఏనాడో రద్దు చేయించిన డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్ పథకాన్ని తిరిగి మెడికల్ ఇన్‌వాలిడేషన్ కారుణ్య నియామకాల పేరిట అమలు చేయించిన ఘనత తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. మందమర్రిలోని టీబీజీకేఎస్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన మేడే వేడుకల్లో ఆయన పాల్గొని పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సాధ్యం కాని హామీలతో అబద్ధపు ప్రచారాలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ కారుణ్య నియామక పత్రాలను హైదరాబాద్‌లో అందజేసి గొప్ప పని చేసినట్లు ఆ పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికుల పోరాట పటిమను గుర్తించి కేసీఆర్ ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇచ్చి గౌరవించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ ప్రభుత్వ సహకారంతో అనేక హక్కులను సాధించిందని చెప్పారు. కేసీఆర్ చేసిన మేలును కార్మికులకు వివరించి పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు కోరాలని, బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వేల్పుల రవి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్, డాక్టర్ రాజారమేశ్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, బీఆర్ఎస్, టీబీజీకేఎస్ సీనియర్ నాయకులు ఓ.రాజశేఖర్, బడికెల సంపత్, కొంగల తిరుపతి రెడ్డి, ఎండీ అబ్బాస్, బోరిగం వెంకటేశ్, మద్ది శంకర్, ఎంవీ.గుణ, మంద వేణుగోపాల్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## ఏర్పాట్లు చేయండి..

నస్పూర్, మే 1 : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మే 13వ తేదీన జరగనున్న పోలింగ్‌లో పాల్గొనే ఓటర్లకు అసౌకర్యం కలుగకుండా పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు, ఆర్డీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ కోసం ప్రత్యేక బృందాలను నియమించడం జరిగిందని, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు సెగ్మెంట్లలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు రాహుల్, మోతీలాల్, ఆర్డీవో రాములు, ప్రత్యేక ఉప పాలన అధికారి చంద్రకళ, డీపీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు, అధికారులు

### నేడు బీఆర్ఎస్ బెల్లంపల్లి నియోజకవర్గ సమావేశం

బెల్లంపల్లి, మే 1 : బీఆర్ఎస్ బెల్లంపల్లి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం గురువారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య నివాసంలో నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్‌వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు సుమన్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

### జైనూర్ వ్యవసాయ అధికారి సస్పెన్షన్

జైనూర్, మే 1 : జైనూర్ మండల వ్యవసాయ అధికారి జాదవ్ పవన్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని దబోలి పంచాయతీలో కోలం రైతు మృతి చెందాడు. బీమా పథకం కింద పత్రాలు పంపించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఈ విషయంపై బాధిత రైతు బంధువులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ చేసి నివేదికలు పంపగా.. రైతు బీమా క్లెయిమ్‌లో నిర్లక్ష్యం చేశారనే అభియోగంపై పవన్ కుమార్‌ను సస్పెండ్ చేశారు.

### నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం

### మంచిర్యాల విద్యుత్ శాఖ

**ఎస్ఈ శ్రావణ్‌కుమార్**

మంచిర్యాలటౌన్, మే 1: అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు మంచిర్యాల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఎన్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. వరంగల్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన బుధవారం ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పట్టణాలు, మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు అంతా హెడ్ క్వార్టర్స్‌లో ఉండి పర్యవేక్షించాలని సూచించారు. ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా కోసం 17.7 కిలోమీటర్ల 33 కేవీ లైన్ లక్షెట్టిపేట నుంచి తపాల్‌పూర్ వరకు నిర్మించినట్లు తెలిపారు. చెన్నూరు, బెల్లంపల్లి సబ్ డివిజన్‌లో రూ. 6 కోట్లతో 11కేవీ ఫీడర్లను బలోపేతం చేశామని, ఆర్‌కే 6 సబ్‌స్టేషన్‌లో కోటి రూపాయలు వెచ్చించి పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటిని పెంచినట్లు తెలిపారు. పెరిగిన విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, లోవోల్టేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.